క్లుప్తంగా

సమ్మెకు సై...


సమ్మె నోటీసు అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

అబ్దుల్లాపూర్‌మెట్: రెండో ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఈనెల 16వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏఎన్ఎంలు సమ్మెకు దిగుతున్నట్లు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం పద్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసినా.. తెలంగాణ ప్రభుత్వం నేటికీ రెగ్యులరైజ్ చేయలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండలంలోని రెండో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తాండ గ్రామ పరిధిలోని పులుగోనిపల్లి తాండ నుంచి ఆకుతోటపల్లి గ్రామానికి రూ. 3 లక్షలతో మట్టి రోడ్డుకు మరమత్తు పనులు నిర్వహిస్తున్నారు. రోడ్డు మరమత్తు పనులను సోమవారం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో సీతారాంగనర్ తాండ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, వార్డు సభ్యులు రైసల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్ అందజేత


స్పోర్ట్స్ డ్రస్ వేసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తుర్కయంజాల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇంజాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీరాములు స్పోర్ట్స్ డ్రస్‌ను అందజేశారు. తన తమ్ముడు బట్టు ఆంజనేయులు సైన్యంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు బొడ్డు రవి, విజయమ్మ, శ్రీనివాసులు, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక విక్రయాలు

కడ్తాల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్ర ప్రభుత్వం హర్‌ఘర్ తిరంగా- 2.0 కార్యక్రమంలో భాగంగా, ప్రతి ఇంటిపై జాతీయ పతకాన్ని ఎగురవేసే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని తపాల కార్యాలయం ఆధ్వర్యంలో తపాల సిబ్బంది జాతీయ పతకాలను విక్రయించారు. కడ్తాల్ తపాల కార్యాలయం ఆధ్వర్యంలో 314 జాతీయ పతకాలను విక్రయించినట్లు, ప్రతి పౌరుడు ఉత్సాహంగా జాతీయపతాకాన్ని కొనుగోలు చేశారని పోస్ట్‌మాస్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది రవి తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

షాబాద్: గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిర్మలాపూర్ గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి సహకారంతో అత్యధికంగా నిధులు తీసుకువచ్చి జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకట్‌రెడ్డి, అంజయ్య, రాములు, దేవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, అజయ్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆదర్శం

అబ్దుల్లాపూర్‌మెట్: కవాడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలను చూసి చలించిపోయారు. పాత పాఠశాల భవనంతో పాటు, కొత్త భవనాలకు లక్ష రూపాయలతో రంగులు వేయించారు. పాఠశాల భవనానికి రంగులు వేసిన తర్వాత పాఠశాల ముందు ఫొటో దిగి తమకు గర్వంగా ఉందన్నారు.

నిధులు రావు.. పనులు కావు

- మంత్రి కేటీఆర్ శంకుస్థాపన.. అసంపూర్తిగా భవనం
- నిధుల్లేక ఆగిన నిర్మాణం
- చొరవ తీసుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిధులు విడుదల కాకపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిజాం కాలం నాటి పాత భవనాన్ని కూల్చివేసి అదే స్థానంలో కొత్త భవనం నిర్మిస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్లాబ్‌లు, గోడల నిర్మాణం వరకు పనులు చకచక సాగిపోయాయి. ఆ తర్వాత నిధుల సమస్యతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం జేడీ్ప విశ్రాంతి భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. ఇరుకుగదుల్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. భూరిజిస్ట్రేషన్లతో పాటు వివిధ పనుల కోసం వచ్చే వారికి తిప్పలు తప్పడంలేదు.

నిధుల సమస్య

భవన నిర్మాణానికి నిధుల సమస్య ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రారంభంలో డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) కింద మంజూరైన


అసంపూర్తిగా నిలిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనం

రూ. 1.25 లక్షల నిధులతో తహసీల్దార్ కార్యాలయ భవన ని ర్మాణాన్ని చేపట్టారు. అయితే అదనపు నిధులు మంజూరు కాకపోవడంతో ఈ నిధుల వరకే కంట్రా క్టర్ పనులు చేసి నిలిపివేశాడు. మరో కోటి రూపాయల నిధులు కేటాయిస్తేనే తిరిగి ఈ భవన నిర్మాణ పనులు పట్టాలెక్కే అవకాశం ఉంది. అంతవరకు ప్రజలకు, అధికారులకు ఇబ్బందులు తప్పవు.

ఎమ్మెల్యే ప్రతిపాదనలు పంపారు



తహసీల్దార్ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. మరో కోటి రూపాయలు ఈ భవన నిర్మాణానికి అవసరం. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– ఇంద్రసేనారెడ్డి, మండల ఏఈ, ఇబ్రహీంపట్నం

ప్రజారోగ్యానికి మోక్షం

ఆస్పత్రికి అప్‌గ్రేడ్ హోదా

- రూ. 2 కోట్లు మంజూరు
- 17న మంత్రులు హరీశ్, సబితారెడ్డితో భూమిపూజ

యాచారం: యాచారం ప్రభుత్వ ఆస్పత్రి భవనానికి మోక్షం కలగనుంది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో 40 ఏళ్ల క్రితం ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. అప్పట్లో ఉన్నత స్థాయి ఆస్పత్రిగా యాచారం ప్రభుత్వాసుపత్రి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించింది. అయితే ఉన్నత స్థాయి ఆస్పత్రిని 2009లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా డిగ్రేడ్ చేయడంతో మెరుగైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలు ఈ ఆస్పత్రికి రావడానికి ఆసక్తి చూపడం లేదు.

సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్


యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతేడాది సీహెచ్‌సీ (ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం)గా అప్‌గ్రేడ్ హోదా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర వైద్య, విధానపరిషత్ కింద ఆస్పత్రి ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. దీనికితోడు శాశ్వత భవనం లేకపోవడంతో ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది నియమించడం లేదు. దీంతో వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలను అసంతృప్తి చేస్తున్నారు.

17న భూమి పూజ

ఈ నెల 17న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా యాచారంలో సీహెచ్‌సీ నూతన భవనానికి భూమి పూజ చేయనున్నారు. రూ. 2 కోట్లతో జిల్లా మినరల్ ఫండ్ నిధుల ద్వారా ఈ ఆస్పత్రిని నిర్మించనున్నారు.


యాచారం: శిథిలావస్థలో సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం

అర్హులకే సంక్షేమ పథకాలు


యాచారం: సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- పేదలకే ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: కేసీఆర్ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకే అందజేస్తామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రకటించారు. పథకాల ఎంపికలో వారికే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో సోమవారం నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల భారతమ్మకు రూ. 60 వేలు, మక్కపల్లి ప్రకాష్‌కు రూ. 28 వేలు, కొంగర్ల భారతమ్మకు రూ. 27 వేలు, అయ్యవారిగూడెంకు చెందిన సభావత్ అంజమ్మకు రూ. 31 వేలు, మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన నర్సింహకు రూ. 32 వేలు, సత్యనారాయణకు రూ. 28 వేలు, మాధవికి రూ. 16 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితబంధు, గృహలక్ష్మి తదితర పథకాలను అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 8వ వార్డుకు చెందిన కత్తి రేణుకా శ్రీనివాస్‌కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నాగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులకు రూ. 3.42 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పంపిణీ చేశారు.

వైన్స్ టెండర్లలో న్యాయం చేయాలి

ఆమనగల్లు: వైన్‌షాపు టెండర్లలో పాల్గొనే రిజర్వేషన్‌దారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పీసీసీ సభ్యులు, కల్వకుర్తి గౌడసంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఖజానా నింపుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వైన్‌షాపులకు 3 నెలల ముందే టెండర్లు నిర్వహించిందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం వైన్‌షాపు కేటాయింపులో గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించిన ప్రభుత్వం దరఖాస్తు రుసుములో ఎందుకు రాయితీ కల్పించడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షలు కట్టి వైన్‌షాపు టెండర్లలో పాల్గొనే రిజర్వేషన్ దారులకు షాపు దక్కకపోతే దరఖాస్తు రుసుము 2 లక్షలు తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయండి

కడ్తాల్: కడ్తాల్ మండలం వాస్‌దేవ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నారం తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ తండా యువజన నాయకుడు కేతావత్ రాజేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వాస్‌దేవ్‌పూర్ పంచాయతీ పరిధిలో గల నేరేళ్లకోల్ తండా, కాడియతండా, రావుజనాయక్ తండాను కలిపి, పరిపాలన సౌలభ్యం కోసం చెన్నారంను ప్రత్యేక గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరినట్లు రాజేందర్‌నాయక్ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు జెడ్పీటీసీ చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. మండలంలోని లింగరావుపల్లికి చెందిన అంజమ్మ, అండాలు, సైదులు, రాములమ్మ ఇటీవల నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ నలుగురి ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్, ఇటుక, తదితర సామగ్రిని సోమవారం అందజేశారు. అలాగే పాతకోటతండాకు చెందిన నర్సింగ్ నాయక్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వెంకటేశ్ రూ. 3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అలివేలు, జీరానాయక్, ఎల్లమ్మ, తిరుపతయ్య, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, బ్లడ్ క్యాంపు చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లింగరావుపల్లిలో ఇంటి నిర్మాణానికి సామగ్రిని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కోనాపూర్ గ్రామంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన కంబాలపల్లి ఈశ్వరమ్మ, గొడుగు పావని ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సామగ్రిని అందజేశారు.

మహిళలను ప్రోత్సహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవికాంత్‌గౌడ్

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్

కడ్తాల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతిభావంతులైన మహిళలను ప్రోత్సహించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి, ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శక్తి సూపర్ షీ' కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన మహిళల ఆధ్వర్యంలో, అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో జాతీయ జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టాలని కోరారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, కడ్తాల్, ఆమనగల్లు మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు ఇమ్రాన్‌బాబా, శివ, బాలకృష్ణ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన రాఘవేందర్‌రెడ్డి తదితరులు

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తి భావం మరింత పెంపొందుతోందని, ఆలయ నిర్మాణాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని రావిచేడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయానికి, స్థానికులతో కలిసి ఆయన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాల నిర్మాణం పూర్తి చేసిన తర్వాత దూప, దీప, నైవేద్యాలు, భజనలు, సేవ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ గోపాల్, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు విఠలయ్యగౌడ్, రమేశ్, నర్సింహ ప్రశాంత్, భీమ్లానాయక్, పాండుగౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.

మైసమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే


మైనంపల్లిని సన్మానించిన నిర్వాహకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి ఆలయంలో అమ్మవారిని సోమవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హర్ ఘర్ తిరంగా అందరి బాధ్యత

ఆమనగల్లు: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశంపై ఉన్న ప్రేమాభిమానాలు చాటుకోవాలని జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండెసాయి కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక అయ్యప్ప కొండ వద్ద బైక్ ర్యాలీని కండెసాయి ప్రారంభించారు. అనంతరం స్థానిక పట్టణంలోని అన్ని వీధుల్లో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భగీరథ్, జిల్లా ప్రతినిధి ప్రభాకర్, మండల బీజేవైఎం అధ్యక్షుడు శ్రీను, కల్వకుర్తి బీజేపీ మీడియా కన్వీనర్ రవిరాథోడ్ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో కండెసాయి తదితరులు

ఆర్థిక ప్రగతితోనే మహిళలకు గుర్తింపు

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: అక్షరాస్యత, ఆర్థిక ప్రగతితోనే మహిళలకు గుర్తింపు వస్తుందని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఉంటే కుటుంబాల్లో సంతోషంగా ఉంటుందని అన్నారు. ఆర్థిక రుణాలతో వ్యవసాయంలో పెట్టుబడులు, చిరువ్యాపారాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, సెర్ప్ ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే నివాళి


వెంకట్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, తదితరులు

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ మాజీ సింగిల్ విండో డైరెక్టర్ బూడిద వెంకట్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నివాళి అర్పించారు. సోమవారం వెంకట్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంతో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి సతీమణి, ఆయన కుమారులైన లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నందారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డితో కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్ నాయకులు పలువురు ఉన్నారు.

ఘనంగా శివ సహస్రనామ యజ్ఞం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీ శివ సహస్రనామయజ్ఞం ఘనంగా నిర్వహించారు. శివ సహస్రనామ యజ్ఞం సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివానందస్వామి ఆధ్వర్యంలో శివసహస్రనామ యజ్ఞం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ సభ్యులు కిషన్‌రెడ్డి, కార్యనిర్వాహకులు విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం లేక అవస్థలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నాలో బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం సాంకేతిక సమస్యలతో మూసివేశారని, అప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆమనగల్లులో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తే ఆమనగల్లు మండలంతో పాటు కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలకు ఇబ్బందులు తీరుతాయన్నారు. అనంతరం తహసీల్దార్ లలితకు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కండెసాయి, మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజశేఖర్, రాఘవ, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: మాడ్గుల మండల గౌడసంఘం ఆధ్వర్యంలో విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా కొత్త పాండుగౌడ్, కన్వీనర్‌గా కొప్పుల జగన్‌గౌడ్, కో కన్వీనర్‌లుగా దళపతిగౌడ్, నవీన్‌గౌడ్, సత్యంగౌడ్, బిక్కుగౌడ్, శివగౌడ్, రాజుగౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనుగౌడ్, చంద్రయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, గానినర్సింహా తదితరులు పాల్గొన్నారు

పోరాటం ఆగదు

జేఏసీ నాయకుడు రేణురెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంత వరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకుడు రేణురెడ్డి స్పష్టం చేశారు. మండలాన్ని సాధించేవరకు పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 43వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రేణురెడ్డి మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్నీ ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి మండలం ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు దామోదర్, డేవిడ్, పవన్ వాల్మీకి, దైవానందం, చెన్నయ్య, రాజు, నరసింహ, అంజి, శ్రీకాంత్, జంగోజి, ముత్యాలు పాల్గొన్నారు.